సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం | 29 | జూన్ | 2025



విత్తన శుద్ధి కీలకం
వరి సాగులో విత్తన ఎంపిక, విత్తన శుద్ధి, సస్యరక్షణ వంటి వాటిపై రైతులు దృష్టి పెట్టాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. 8లో ▸



విద్యార్థులకు బంగారు భవిత
గ్రామీణ విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ఇంజినీరింగ్ విద్యను అందించేలా **దివంగత సీఎం వైఎస్సార్ ఆలోచనలకు రూపమే ట్రిపుల్ ఐటీలు.** 8లో ▸



పిల్లలతో కలిసి ఆత్మహత్యాయత్నం
ఏలూరులోని తమ్మిలేరులో దిగి ఓ మహిళ తన ముగ్గురు చిన్నారులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా స్థానికులు రక్షించారు. 8లో ▸

న్యూస్‌రీల్

ఓటర్ల సవరణపై సమీక్ష



సమీక్షిస్తున్న డీఆర్వో వెంకటేశ్వర్లు

భీమవరం (ప్రకాశంచౌక్): 2025 ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో శనివారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు సమావేశం నిర్వహించారు. కొత్త ఓటర్ల నమోదు, జాబితాలో సవరణలు, పోలింగ్ స్టేషన్లలో మౌలిక వసతులు, ఎలక్టోరల్ రోల్స్ ప్యూరిఫికేషన్ విషయంలో సహకరించాలని కోరారు. ఈ ఏడాదిలో కొత్తగా ఓటరు దరఖాస్తులు 6,873 రాగా 6,187 ఆమోదించామని చెప్పారు. అలాగే ఓటరు జాబితా నుంచి తొలగింపుల కోసం 1,191 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఓటర్ల మార్పులు, చేర్పులకు 15,735 దరఖాస్తులకు 14,788 ఆమోదించామన్నారు. జిల్లాలో పురుషులు 7,20,684 మంది, మహిళలు 7,50,377 మంది, థర్డ్ జెండర్స్ 77 మంది మొత్తం ఓటర్లు 14,71,138 ఉన్నారన్నారు. ఎన్నికల సూపరింటెండెంట్ ఎం.సన్యాసిరావు, ఐఎన్‌సీ ప్రతినిధి టి.వంశీ శ్రీనివాసరెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు బి.జయశివ, ఎం.రత్నరాజు పాల్గొన్నారు.

ధాన్యం సొమ్ముల కోసం రేపు ధర్నా

భీమవరం: ప్రభుత్వానికి ధాన్యం విక్రయించిన రైతులకు సొమ్ములు చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని, ధాన్యం సొమ్ముల కోసం నిలదీసేందుకు ఏపీ కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్టు సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సుబ్బరాజు, ఎం.రామాంజనేయులు శనివారం తెలిపారు. ధాన్యం అమ్మి రెండు నెలలు గడిచినా ఇప్పటికీ సొమ్ములు ఇవ్వకపోవడంతో పంట పెట్టుబడులకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సార్వా పనుల కోసం ప్రైవేట్ వ్యక్తుల వద్ద వడ్డీలకు తేవాల్సి వస్తోందన్నారు. ధర్నాకు రైతులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

గీత వృత్తిపై ప్రభుత్వం కక్ష



మాట్లాడుతున్న నరసింహమూర్తి

తణుకు అర్బన్: బెల్టు షాపులను అరికట్టి అక్రమ మద్యం అమ్మకాలను నిలుపుదల చేయాలని ఏపీ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి అన్నారు. శనివారం స్థానిక అమరవీరుల భవనంలో నిర్వహించిన ఏపీ కల్లుగీత సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి సిద్ధమైన తాటికల్లుపై ప్రభుత్వం కక్ష కట్టి అక్రమ మద్యం, ఊరువాడా బెల్టు షాపుల్లో అమ్మకాలు చేస్తూ కల్లు అమ్మకాలను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. గీత వృత్తిపై ప్రభుత్వం కక్ష కట్టిందన్నారు. జిల్లా అధ్యక్షుడు కామన మునిస్వామి మాట్లాడుతూ మద్యం విచ్చలవిడి అమ్మకాలతో పలు కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయన్నారు. జూలై 14న కల్లుగీత కార్మికుల వెతలు కలెక్టర్‌కు చెప్పుకుందాం కార్యక్రమానికి భీమవరం తరలిరావాలని కోరారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి బొక్క చంటి, జిల్లా ఉపాధ్యక్షుడు కడలి పాండు పాల్గొన్నారు.

అత్యవసర సర్వీసుల విధుల బహిష్కరణ

నరసాపురం: మున్సిపల్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆందోళనలో భాగంగా అత్యవసర సేవల విధులు కూడా బహిష్కరించాలని నిర్ణయించినట్టు జేఏసీ నాయకులు తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి వీధి దీపాల నిర్వహణ, మంచినీటి సరఫరా పనులు నిర్వహణను కూడా బహిష్కరిస్తామన్నారు. తాము సమ్మెలో ఉన్నా ప్రజలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ప్రస్తుతం ఈ విధులు నిర్వహిస్తున్నామని, అయితే ఆందోళనకు ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

ఆషాఢం ఎఫెక్ట్



శ్రీవారి క్షేత్రంలో భక్తులు

ద్వారకాతిరుమల: చినవెంకన్న క్షేత్రంపై ఆషాఢం ఎఫెక్ట్ పడింది. దీంతో శనివారం భక్తుల రద్దీ బాగా తగ్గింది. సాధారణంగా భక్తుల రాక ఎక్కువగా ఉండాల్సి ఉండగా సాధారణంగానే కనిపించింది. ఆలయంలో అన్ని విభాగాల్లో భక్తులు నామమాత్రంగా కనిపించారు.

కాపు కాయరా?



కూటమి వివక్ష
- చంద్రబాబుకు కేఆర్‌పీఎస్ లేఖతో తెరపైకి కాపు రిజర్వేషన్ అంశం
- ఆరు నెలల్లోనే రిజర్వేషన్లు ఇస్తామని 2014 ఎన్నికల్లో చంద్రబాబు హామీ
- తర్వాత గాలికొదిలేసిన వైనం
- లేఖలోని అంశాలపై కాపు వర్గాల్లో చర్చ

సాక్షి, భీమవరం: కూటమి సర్కారుకు కాపు రిజర్వేషన్ పోరాట సమితి (కేఆర్‌పీఎస్) రాసిన బహిరంగ లేఖతో కాపు రిజర్వేషన్ల అంశం తెరపైకి వచ్చింది. కాపు సామాజిక వర్గంలో తాజాగా ఈ లేఖ హాట్ టాపిక్‌గా మారింది. ఎన్నికలు సందర్భంగా కాపు రిజర్వేషన్ల అమలుకు గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను కాపు నేతలు గుర్తుచేసుకుంటున్నారు.

అధికారంలో ఉంటే ఒకలా.. లేకుంటే మరోలా..
తుని రైలు ఘటన కేసును కొట్టివేస్తూ 2023లో న్యాయస్థానం ఇచ్చిన తీర్పును చంద్రబాబు సర్కారు ఇటీవల తిరగదోడాలని చూసి విమర్శల పాలైన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా కాపు సామాజికవర్గం నుంచి వ్యతిరేకత రావడంతో ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకుంది. కాపు రిజర్వేషన్ల విషయమై ఇటీవల కేఆర్‌పీఎస్ విడుదల చేసిన లేఖ చర్చనీయాంశంగా మారింది. కాపులకు రిజర్వేషన్ల హామీని ఎప్పటి నుంచి అమలు చేస్తారని లేఖలో ప్రశ్నించిన కేఆర్‌పీఎస్ గత ఎన్నికల్లో చంద్రబాబు కాపులకు ఇచ్చిన హామీలు, అధికారంలోకి వచ్చాక ముఖం చాటేసిన వైనాలను ప్రస్తావించడంతో గతంలో సీఎం చంద్రబాబు చేసిన వంచనను చర్చించుకుంటున్నారు. **అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రిజర్వేషన్లు అమలుచేస్తామని 2014లో హామీ ఇచ్చి తర్వాత** గాలికొదిలేయడం, హామీ అమలు కోసం 2016 జనవరి 30న వేలాది మందితో తూర్పుగోదావరి జిల్లా తునిలో కాపు గర్జన నిర్వహించడం గుర్తు చేసుకుంటున్నారు. ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేసేందుకు గుర్తుతెలియని విద్రోహులు రైలు బోగీలకు నిప్పంటించగా నాటి టీడీపీ ప్రభుత్వం, రైల్వే పోలీసులు ఆందోళనకారులు, కాపులపై కేసులు పెట్టడం, తర్వాత వచ్చిన జగన్ సర్కారు వాటిలోని చాలా వరకు కేసులను ఉపసంహరించుకోగా, కొన్నింటిని న్యాయస్థానం కొట్టివేయడాన్ని స్మరించుకుంటున్నారు. సీఎం చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఒకలా.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా వ్యవహరిస్తున్నారని, బీసీలకు ఇబ్బంది కలగకుండా తమకు రిజర్వేషన్లు అమలుచేయాలని కోరుతున్నారు.

తెప్ప తగలేసిన మాదిరి..



కులాలను అడ్డుపెట్టుకొని రాజకీయం చేయడం, ఏరుదాటాక తెప్ప తగలెయ్యడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. కాపులకు న్యాయం చేయాలి, ఐదు శాతం రిజర్వేషన్ల కల్పనకు పవన్‌కల్యాణ్ చొరవ చూపాలి.
– కత్రెడ్డి రామ్మోహనరావు, కాపు జేఏసీ నాయకుడు, పెదకాపవరం

చేయూత ఇవ్వాలి



రిజర్వేషన్ల అమలుతోనే కాపులకు న్యాయం జరుగుతుంది. కాపు రిజర్వేషన్ల అమలుకు గతంలోనే చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ దిశగా ఐదు శాతం రిజర్వేషన్లను కూటమి ప్రభుత్వం అమలు చేసి కాపు వర్గాలకు చేయూతనివ్వాలి.
– వంటెద్దు ఈశ్వర ప్రసాద్, తణుకు కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు

మరోమారు ఉద్యమం



సీఎం చంద్రబాబు కాపు వ్యతిరేకి. కక్ష సాధింపులో భాగంగానే కోర్టు కొట్టివేసిన కేసుపై పునర్విచారణకు వెళ్లాలని చూశారు. ఇచ్చిన హామీ మేరకు కాపు రిజర్వేషన్లు అమలుచేయాలి. లేకుంటే రిజర్వేషన్ల సాధనకు మరోమారు ఉద్యమం తప్పదు.
– చినమిల్లి వెంకటరాయుడు, కాపునాడు జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ భీమవరం కో–ఆర్డినేటర్

కాపులపై వివక్ష



ఎన్నికల్లో రిజర్వేషన్ల పేరిట కాపులను మభ్యపెట్టి చంద్రబాబు అధికారం చేపడుతున్నారు. కాపులపై వివక్ష తప్ప ప్రేమ లేదు. బీసీలకు ఇబ్బంది లేకుండా కాపు రిజర్వేషన్ ఇచ్చే అవకాశం ఉన్నా కాలయాపనం చేస్తున్నారు.
– నంద్యాల లక్ష్మీ సీతారామయ్య, కాపునాడు జిల్లా కార్యదర్శి, కువ్వనపూడి

రాజకీయాల కోసమే..



కాపు రిజర్వేషన్ హామీలను సీఎం చంద్రబాబు మరిచిపోయారు. రాజకీయ అవసరాల కోసం కాపులను వాడుకుంటున్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లో ఐదు శాతం కాపులకు సబ్ కోటాగా కేటాయిస్తామన్నారు. అది భ్రమగానే మిగిలిపోయింది.
– పోలిశెట్టి వనమరాజు, కాపు నేత, కొడమంచిలి

న్యాయం చేయాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంలో కాపుల పాత్ర ఎంతో ఉంది. కేంద్రం ఇచ్చిన 10 శాతం రిజర్వేషన్‌లో 5 శాతం కాపులకు ఇస్తామని గతంలో చంద్రబాబు ప్రకటించారు. ఇప్పుడు ఆ హామీని అమలు చేయాలి.
– బోనం సత్యనాగేంద్ర ప్రసాద్, కాపు సంఘం అధ్యక్షుడు, యలమంచిలి

ఓటు బ్యాంకుగానే..



కాపులను చంద్రబాబు ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నారు. కాపు రిజర్వేషన్ల అమలుకు చిత్తశుద్ధితో కృషిచేయాలి. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఈ విషయంపై దృష్టి సారించి సొంత సామాజికవర్గానికి న్యాయం చేయాలి.
– కావలి నాని, కాపు సంఘం నేత, నరసాపురం

చంద్రబాబువి మోసపు హామీలు

మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ



చంద్రబాబు మోసాల జాబితాను వివరించే క్యూర్ కోడ్‌ను విడుదల చేస్తున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: చంద్రబాబు మోసపు హామీల కత్తి మొనకు రాష్ట్ర ప్రజల జీవితాలు వేలాడుతున్నాయని, హామీలను అమలు చేయకపోవడాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో శనివారం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు, ఇప్పుడు చంద్రబాబు పాలనను ప్రజలు బేరీజు వేసుకుంటున్నారన్నారు. జగన్‌ను మించి సంక్షేమ పాలన చంద్రబాబుకు సాధ్యం కాదని మరోసారి రుజువయ్యిందన్నారు. నేడు రాష్ట్రంలో అన్ని రంగాలు, వర్గాల ప్రజలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారన్నారు. ఆరోగ్యశ్రీ నిలుపుదల చేసి కార్పొరేట్ వైద్యం ప్రజలకు దూరం చేసిన అసమర్థ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నిలిచారని మండిపడ్డారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. విద్యార్థులకు సరిపడా భోజనం సరఫరా చేయడం లేదన్నారు. సూపర్ సిక్స్ పథకాలు, స్త్రీశక్తి, ఉచిత బస్సు, ప్రతి కుటుంబానికీ ఉద్యోగం, నిరుద్యోగభృతి రూ.3 వేలు, 18 ఏళ్లు నిండిన మహిళలకు ఆడబిడ్డ నిధి, 50 ఏళ్లకే పింఛన్ హామీలు ఎప్పుడు అమలు చేస్తారని కూటమి నాయకులను ప్రశ్నించారు.

కోడిపందేలు.. పేకాట క్లబ్‌లు
నియోజకవర్గంలో కోడిపందేలు, పేకాట క్లబ్‌లు, దందాలు, ఇళ్లు నిర్మించుకుంటున్న వారి నుంచి అక్రమ వసూళ్ల తీరుపై ప్రతిపక్ష నేతలు ప్రశ్నిస్తుంటే కూటమి నాయకులు తట్టుకోలేకపోతున్నారన్నారు. ప్రజాప్రతినిధులు తమ ద్వారా లబ్ధి పొందుతున్న వారితో కౌంటర్ ఆఫ్ ఫైర్ అనే కొత్త రీతిలో ప్రవర్తిస్తున్నారు తప్ప ప్రతిపక్ష నేతల ప్రశ్నలు జవాబు చెప్పలేకపోతున్నారని విమర్శించారు. శాంతి, భద్రతలను నీరుగార్చిన ఘనత వీరికే దక్కిందన్నారు. పోలీసులు, అధికారులు విధుల్లో విఫలమయ్యారని మాజీ మంత్రి కొట్టు ఆరోపించారు.

అసమర్థ, అవినీతి పాలన
కూటమి ప్రభుత్వ అసమర్థ, అవినీతి పాలనపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జూలై నుంచి నిర్వహించే కార్యక్రమాలను నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జయప్రదం చేయాలని కొట్టు పిలుపునిచ్చారు. చంద్రబాబు ఇచ్చిన ఎన్నికల హామీలను ప్రతి కుటుంబానికీ ఏ మేరకు అందాయో రాత పూర్వక పత్రాల ద్వారా ప్రజల నుంచి వివరాలు సేకరించాలన్నారు. సూపర్ సిక్స్, పీ–4 పథకాలు వల్ల ప్రజలకు కలిగిన లబ్ధి వివరాలూ సేకరించాలన్నారు. అలాగే చంద్రబాబు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన బాండ్ల ద్వారా ప్రజలకు ఏమేరకు సంక్షేమ పథకాల లబ్ధి చేకూరిందో తెలుసుకోవాలని కోరారు. అనంతరం రాష్ట్ర పార్టీ కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు క్యూర్ కోడ్, ముందు మాట, చంద్రబాబు మోసపు హామీల చిట్టా వంటి పలు రకాల పత్రాలను మంత్రి కొట్టు చేతులమీదుగా ఆవిష్కరించారు. పార్టీ నాయకులు కొలుకులూరి ధర్మరాజు, ముప్పిడి సంపత్‌కుమార్, ఎంపీపీ దాసరి హైమావతి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నాయకురాలు హుస్సేన్ బీబీ, తాడిపర్తి రజని, జిడ్డు హరిబాబు, కైగాల శ్రీనువాసు, రెడ్డి సూరిబాబు, తాడేపల్లిగూడెం పట్టణ, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నాచు పెంపకంపై అవగాహన



మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

భీమవరం: సముద్రపు నాచు (సీ వీడ్) పెంపకంపై నరసాపురం, మొగల్తూరులో మత్స్యకార మహిళా సంఘాలకు శిక్షణ ఇప్పించి అవగాహన కల్పించాలని జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం మత్స్యశాఖ అధికారులతో సమీక్షించారు. 1100, పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలన్నారు. జిల్లా మత్స్య శాఖ అధికారి ఆర్‌వీఎస్ ప్రసాదరావు, సహాయ సంచాలకులు సీహెచ్ వెంకటేశ్వరరావు, ఎల్ఎన్ రాజు, ఎఫ్‌డీఓలు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి
జిల్లా జూనియర్, యూత్ రెడ్ క్రాస్ గ్రూపుల్లో విద్యార్థులు సభ్యత్వం తీసుకుని సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని జేసీ సూచించారు. కలెక్టరేట్ నుంచి ఎంఈఓలు, ప్రిన్సిపాళ్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

రాజీకి వెళితే తల పగలగొడతారా?



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: గతంలో జరిగిన గొడవ పరిష్కారం నిమిత్తం రాజీకి వెళితే తలపగలగొట్టడం ఏం సంప్రదాయమని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ వర్గీయుల తీరు మారదా అని ఆయన ప్రశ్నించారు. శనివారం టీడీపీ వర్గీయుల దాడిలో తలపగిలి తీవ్రంగా గాయపడిన ఈదా భార్గవ్‌ను, అతని కుటుంబ సభ్యులను రాయన్నపాలెంలోని వారి నివాసంలో కలిసి పరామర్శించారు. వ్యక్తిగతంగా, పార్టీ పరంగా బాధితులకు, వారి కుటుంబాలకు అండగా ఉంటామని అబ్బయ్యచౌదరి చెప్పారు.

అసలేం జరిగిందంటే..
గత ఆదివారం యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ మహేష్‌యాదవ్, స్నేహితులు రాట్నాలకుంట వెళ్లి తిరిగి వస్తుండగా రాయన్నపాలెం వద్ద కొంతమంది యువకులతో ఘర్షణ జరిగింది. ఇరువర్గాలు పరస్పరం దాడి చేసుకున్నాయి. దీనిపై మహేష్‌యాదవ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మహేష్ యాదవ్‌పై దాడి చేసిన వారి తల్లిదండ్రులు స్థానిక టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని వద్దకు వెళ్లి సమస్యను పరిష్కరించాలని కోరడంతో మహేష్ యాదవ్‌ను వ్యక్తిగతంగా కలిసి రాజీ చేసుకోవాలని ఎమ్మెల్యే చెప్పారు. దీంతో శనివారం దెందులూరులోని మహేష్ యాదవ్‌కు చెందిన దాబా వద్దకు దాడి చేసిన యువకులు, వారి తల్లిదండ్రులు వెళ్లారు. వారిపై టీడీపీ నాయకులు మన్నే శ్రీనివాసరావు, బొద్దు సురేంద్ర, మహేష్ యాదవ్ అనుచరులు దాడికి పాల్పడి తీవ్రంగా గాయపరిచారు. విషయం తెలిసిన చింతమనేని హోటల్ వద్దకు వెళ్లి బాధితులను పరామర్శించారు. తర్వాత ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పెదవేగి సీఐ రాజశేఖర్ ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి వివరాలు తెలుసుకుని కేసు నమోదు చేయాల్సిందిగా దెందులూరు ఎస్సైని ఆదేశించారు.

అంతా మా ఇష్టం

- వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో అధికారుల పెత్తనం
- ఉద్యోగులతో ఆప్షన్ ఫారాలపై సంతకాలు
- పీహెచ్ ఉద్యోగుల విన్నపాలు బుట్టదాఖలు



తాడేపల్లిగూడెంలోని వార్డు సచివాలయం

తాడేపల్లిగూడెం: వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల వ్యవహారంలో అధికారుల పెత్తనాన్ని ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. ఒకే చోట ఐదేళ్లు పనిచేసిన వారిని కచ్చితంగా బదిలీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రాతిపదికన మున్సిపాలిటీలు, ఏలూరు కార్పొరేషన్‌లో బదిలీల ప్రక్రియకు ఐచ్ఛికాలను ఇవ్వడానికి ఈనెల 28న ఏలూరులోని ప్రక్రియ ఇన్‌చార్జి వద్దకు ఉద్యోగులు నేరుగా హాజరు కావాలనేది ఉత్తర్వుల సారాంశం. రాష్ట్రవ్యాప్తంగా శనివారం బదిలీల ప్రక్రియ చేపట్టగా ఆయా జిల్లాల ప్రక్రియ ఇన్‌చార్జి వద్దకు ఉద్యోగులు నేరుగా హాజరయ్యారు. అయితే ఇందుకు భిన్నంగా జిల్లాలో బదిలీల ప్రక్రియ నిర్వహించడం విమర్శలకు తావిస్తోంది. ఉద్యోగులు నేరుగా హాజరై ఆప్షన్లు ఇవ్వాల్సి ఉండగా ఇక్కడ మాత్రం బదిలీల ఐచ్ఛిక పత్రాలపై ఉద్యోగుల సంతకాలు తీసుకుని ఇన్‌చార్జి అధికారికి ఆయా మున్సిపల్ కమిషనర్లు సమర్పించారు.

కమిషనర్లకు బాధ్యతలు
ఉమ్మడి జిల్లాలో నరసాపురం, పాలకొల్లు, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, కొవ్వూరు, జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీలు, ఏలూరు కార్పొరేషన్ పరిధిలో బదిలీల ప్రక్రియను పర్యవేక్షించే బాధ్యతను మున్సిపల్ కమిషనర్లకు ప్రభుత్వం అప్పగించింది. వార్డు సచివాలయంలో ఉండే ప్లానింగ్ సెక్రటరీ, ఎమినిటీస్ సెక్రటరీ, అడ్మిన్, వార్డు ప్లానింగ్ రెగ్యులేషన్ కార్యదర్శి, ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శి, వెల్ఫేర్ సెక్రటరీ, శానిటేషన్ సెక్రటరీలను బదిలీ చేయాల్సి ఉంది. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్లకు బాధ్యతలు అప్పగించారు. భీమవరం కమిషనర్‌కు వెల్ఫేర్ సెక్రటరీలు, తణుకు కమిషనర్‌కు అడ్మిన్ సెక్రటరీలు, నిడదవోలు కమిషనర్‌కు డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులు, పాలకొల్లు కమిషనర్‌కు శానిటేషన్ కార్యదర్శి బదిలీల ప్రక్రియను అప్పగించి, మిగిలిన కార్యదర్శుల బదిలీల ప్రక్రియను ఏలూరులోని ఇన్‌చార్జి అధికారి చూస్తున్నారు. సీనియార్టీ, మెరిట్, ఫిజికల్లీ ఛాలెంజ్డ్ ప్రాతిపదికన జాబితాలు తయారు చేసి అధికారులకు నివేదించడంతో పాటు, ఆప్షన్ల కోసం అభ్యర్థులు నేరుగా హాజరు కావాల్సి ఉంది.

అంతా తూచ్
అభ్యర్థులు నేరుగా ఏలూరులోని ప్రక్రియ ఇన్‌చార్జి వద్దకు హాజరుకాకుండానే మున్సిపల్ కమిషనర్లు తమతో ఆప్షన్ ఫారాలపై సంతకాలు చేయించి జాబితాలను ఏలూరు పంపించినట్టు ఉద్యోగులు చెబుతున్నారు. ఫిజికల్లీ ఛాలెంజ్డ్ ఉద్యోగుల అభ్యర్థనలను బుట్టదాఖలు చేశారని అంటున్నారు. ప్రస్తుత మున్సిపాలిటీలో పనిచేయాలంటే మూడు ఆప్షన్లను ఎంచుకోవాలని, మిగిలిన విషయాలు పర్యవేక్షక అధికారులు చూసుకుంటారని ఉన్నతాధికారులు చెప్పినట్టు సమాచారం. ఆప్షన్ ఫారమ్స్ ఇవ్వని ఉద్యోగులకు వారి ఆప్షన్లతో సంబంధం లేకుండా బదిలీ చేస్తారని అధికారులు స్పష్టం చేశారు. పొలిటికల్ రిఫరెన్స్ లేఖలు, మెడికల్ సర్టిఫికెట్లు, స్పౌజ్ సర్టిఫికెట్లను ఆప్షన్ ఫామ్స్‌కు జత చేసి ఇవ్వాలని ఆదేశించారు.

వైకల్యం ఉన్నా పట్టించుకోవడం లేదు



మాది బుట్టాయగూడెం మండలంలోని ఓ గ్రామం. నాకు 90 శాతం వైకల్యం ఉంది. చాలా ఇబ్బంది పడుతూ విధులు నిర్వర్తిస్తున్నా. గోడు వినిపించుకోడానికి వీలు లేకుండా బదిలీకి సంబంధించి ఆప్షన్ల ఫారాలపై సంతకాలు తీసుకుని వెళ్లారు. నాలాంటి వారి పరిస్థితి ఏంటి.
–అద్దంకి సురేష్, వార్డు డెవలప్‌మెంట్ కార్యదర్శి, తాడేపల్లిగూడెం

ఉన్నతాధికారుల ఆదేశాలతోనే..
వార్డు సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగుల ప్రక్రియకు సంబంధించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆప్షన్ ఫారాలపై సంతకాలు తీసుకున్నాం. ప్రక్రియ వ్యవహారం అంతా ఏలూరులోని అధికారులు పర్యవేక్షిస్తున్నారు.
– ఎం.ఏసుబాబు, తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్

చీటీల పేరుతో రూ.5 కోట్లకు టోకరా



పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న బాధితులు

భీమవరం అర్బన్: చీటీల పేరుతో తోకతిప్ప గ్రామానికి చెందిన పొన్నాల వీర వెంకట సత్యనారాయణ రూ.5 కోట్ల వరకు మోసం చేసి పరారయ్యాడంటూ భీమవరం రూరల్ స్టేషన్ ఎస్సై ఐ.వీర్రాజుకు శనివారం బాధితులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ వీర వెంకటరమణ గ్రామంలో నమ్మకంగా ఉంటూ 15 ఏళ్ల నుంచి చీటీల వ్యాపారం చేస్తున్నాడన్నారు. తోకతిప్పతో పాటు చుట్టుపక్కల 10 గ్రామాల్లో ఆయన చీటీల వ్యాపారం చేస్తున్నాడని, ఆయన కుమారుడు, కుమార్తె ప్రతినెలా వాయిదా సొమ్ములు వసూళ్లు చేసేవారన్నారు. ఇటీవల ఒక్కొక్కరూ 2 నుంచి 5 చీటీల వరకూ వేశామని, చీటీల గడువు ముగియగా వాయిదాల సొమ్ము ఇవ్వమని అడిగితే రేపు మాపు అంటూ రోజులు గడుపుతున్నాడన్నారు. కొద్ది రోజులుగా వెంకటరమణ కనిపించడం లేదని, ఆయన భార్య పద్మావతిని అడిగితే సమాధానం చెప్పకపోగా పోలీసు కేసు పెడతానని హెచ్చరించిందన్నారు. ఈ నేపథ్యంలో వెంకటరమణ కుటుంబంతో సహా కనిపించకుండా పోయాడని, చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని ఎస్సైను అభ్యర్థించారు. కేసు విచారణ చేసి చర్యలు తీసుకుంటానని ఎస్సై వీర్రాజు హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

అంజన్నకు అభిషేక సేవ



మద్దిలో అంజన్నను దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

జంగారెడ్డిగూడెం : గురవాయిగూడెం గ్రామంలో తెల్ల మద్ది చెట్టు తొర్రలో స్వయంభువై వెలిసిన శ్రీ మద్ది ఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రతి శనివారం నిర్వహించే అభిషేక సేవ సందర్భంగా ఆలయ ముఖమండపంపై స్వామివారి ఉత్సవమూర్తికి అర్చక స్వాములు శాస్త్రోక్తంగా పంచామృత అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వివిధ సేవలు , విరాళాల ద్వారా రూ.1,42,813 సమకూరినట్లు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు.

కాలువలో వ్యాన్ బోల్తా

భీమవరం అర్బన్: భీమవరం పట్టణం నుంచి గొల్లవానితిప్ప రోడ్డులో అభయాంజనేయ స్వామి గుడి వద్ద శనివారం రొయ్యల లోడుతో వెళ్తున్న బొలేరో బోల్తా పడింది. వ్యానులో ఉన్న డ్రైవర్, ప్యాకింగ్ బాయ్స్ త్రుటిలో తప్పించుకున్నారు. బొలేరో వాహనాన్ని క్రేన్ సహాయంతో బయటకు తీశారు. మలుపు వద్ద రోడ్డు ఇరుకుగా ఉండటంతో గతంలో భారీ చేపల లారీలు మలుపు తిరిగేందుకు ఇబ్బందులు ఎదురయ్యేవి. ఆర్ అండ్ బీ అధికారులు స్పందించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

వీరవాసరం: రొయ్యల చెరువు వద్ద పనిచేస్తున్న వ్యక్తి విద్యుదాఘాతంతో మృతిచెందాడు. పాలకొల్లు మండలం అరట్లకట్టకు మట్ట ఆదినారాయణ(57) వీరవాసరం మండలం రాయకుదురులో మడుగు వద్ద రొయ్యల చెరువులపై పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం 6 గంటలకు ఇంటి నుంచి బయలుదేరి చెరువుల వద్దకు వెళ్లాడు. చెరువులో ఏరియేటర్లను బిగిస్తూ ఉండగా విద్యుత్ మోటార్‌కు ప్రమాదవశాత్తు తగిలి షాక్‌కు గురై మృత్యువాతపడ్డాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వీరవాసరం ఎస్సై రాజ్ కుమార్ తెలిపారు.

గ్రామీణ విద్యార్థులకు బంగారు భవిత

ఈ నెల 30, జూలై 1న నూజివీడు ట్రిపుల్ ఐటీలో కౌన్సెలింగ్



నూజివీడు: గ్రామీణ పేద వర్గాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ఇంజినీరింగ్ విద్యను అందించేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆలోచనకు రూపమే ట్రిపుల్ ఐటీలు. ఈ ట్రిపుల్ ఐటీలను ఆర్జీయూకేటీ నిర్వహిస్తోంది. ఆరు సంవత్సరాల సమీకృత ఇంజినీరింగ్ విద్యా బోధనకు నిలయమైన ట్రిపుల్ ఐటీలో ఆహ్లాదకరమైన వాతావరణం, క్రమశిక్షణ, ఉత్తమ విద్యాబోధన నూజివీడు ట్రిపుల్ ఐటీ సొంతం. విద్యతో పాటు విద్యార్థుల మానసిక, శారీరక వికాసానికి ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, క్రీడలు, శాస్త్రీయ సంగీతం, నాట్యం, యోగా వంటి వాటిల్లో కూడా శిక్షణనిస్తారు. ఉదయం అల్పాహారం అనంతరం అసెంబ్లీ, 8 నుంచి 12 గంటల వరకు తరగతులు, 12 నుంచి 1గంట వరకు భోజన విరామం, మళ్లీ ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు, అనంతరం టీ, స్నాక్స్, 6 గంటల వరకు ఆటలు, రాత్రి 7 గంటలకు భోజనం, అనంతరం రాత్రి 10 గంటల వరకు స్టడీ అవర్స్.. ఇవీ ట్రిపుల్ ఐటీ విద్యార్థుల దైనందిన కార్యక్రమాలు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఈ నెల 30, వచ్చే నెల ఒకటిన 2025–26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రవేశం పొందనున్న విద్యార్థుల, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు 'సాక్షి' అందిస్తున్న సమగ్ర కథనం.

కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

నూజివీడు ట్రిపుల్ ఐటీలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి నిర్వహిస్తున్న కౌన్సెలింగ్‌లో భాగంగా ఈనెల 30న 550 మంది అభ్యర్థులకు, వచ్చే నెల 1న 550 మంది అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ కౌన్సెలింగ్‌కు రాష్ట్రంలోని నలుమూలల నుంచి సీట్లు వచ్చిన అభ్యర్థులు పాల్గొననున్నారు. కౌన్సెలింగ్‌కు రావాల్సిన అభ్యర్థులందరికీ ఇప్పటికే ట్రిపుల్ ఐటీ అధికారులు కాల్‌లెటర్లు పంపడంతో పాటు వారి సెల్‌ఫోన్‌లకు మెసేజ్‌లు కూడా పంపారు. ట్రిపుల్ ఐటీ ఆవరణలోని స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్‌లో కౌన్సెలింగ్ నిర్వహణకు ఏర్పాటు చేశారు.



- ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ విద్యలో మొదటి రెండు సంవత్సరాలు ఇంటర్‌కు సమానమైన పీయూసీ కోర్సును, తరువాత నాలుగు సంవత్సరాలు ఇంజినీరింగ్ విద్యను బోధిస్తారు.
- ట్రిపుల్ ఐటీలో చేరిన తరువాత విద్యార్థులు మొదటి రెండు సంవత్సరాలు ఏడాదికి రూ.45 వేలు, తరువాత నాలుగు సంవత్సరాలు ఏడాదికి రూ.50 వేలు చొప్పున చెల్లించాలి. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హత కలిగిన విద్యార్థులకు ప్రభుత్వమే చెల్లిస్తుంది. ప్రభుత్వం చెల్లించిన నగదు పోను మిగిలిన సొమ్మును విద్యార్థులే చెల్లించాల్సి ఉంటుంది.
- అన్ని సబ్జెక్టులకు ప్రతి నెలా పరీక్షలు ఉంటాయి. నాలుగు నెలల తరువాత సెమిస్టర్ పరీక్షలు ఉంటాయి. ప్రతి సెమిస్టర్ 24 వారాలు ఉంటుంది. జులై 15 నుంచి తరగతులు ప్రారంభమై నవంబరు 30 వరకు తరగతులు జరుగుతాయి. అనంతరం సెమిస్టర్ పరీక్షలు ఉంటాయి. పీయూసీలో ఎంపీసీ, ఎంబైపీసీ స్ట్రీమ్‌లుంటాయి. ఇంజినీరింగ్‌లో కెమికల్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్, సీఎస్ఈ, ఈసీఈ, ట్రిపుల్ ఈ, సీఎస్ఈ విత్ స్పెషలైజేషన్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్, మెకానికల్, మెటలర్జికల్ అండ్ మెటీరియల్ ఇంజినీరింగ్ బ్రాంచిలున్నాయి.
- సెలవు రోజులలో తల్లిదండ్రులు వచ్చి తమ పిల్లలతో గడపడానికి అవకాశం ఉంటుంది. అత్యవసర పరిస్థితులలో పిల్లలను అవసరమైతే ఇళ్లకు పంపుతారు. ఇచ్చిన గడువులోగా తిరిగి రాకపోతే ఫైన్ విధిస్తారు.
- విద్యార్థుల ఆరోగ్యంకు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. దీనికి ట్రిపుల్‌ఐటీ ఆవరణలోనే 30 పడకల ఆసుపత్రి ఉంది. ఇందులో 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉంటారు.
- ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం కిందకు రాని అభ్యర్థులు మొత్తం ఫీజును చెల్లించాల్సి ఉంటుంది కాబట్టి × డైరెక్టర్, ఆర్జీయూకేటీ ట్రిపుల్‌ఐటీ నూజివీడు× పేరున డీడీని ఏజాతీయ బ్యాంకు నుంచైనా తీసుకుని ఇవ్వాలి.
- రిజిస్ట్రేషన్ ఫీజు కింద వెయ్యి రూపాయలు, ఎస్సీ ఎస్టీలు రూ.500 చెల్లించాలి. గ్రూపు ఇన్సూరెన్స్ కింద రూ.1200, రిఫండబుల్ కాషన్ డిపాజిట్ కింద ప్రతి అభ్యర్థి వెయ్యి రూపాయలు, హాస్టల్ మెయింటెనెన్స్ చార్జి వెయ్యి రూపాయలు అడ్మిషన్ సమయంలో చెల్లించాలి.

కౌన్సెలింగ్‌కు ఏం కావాలి?

పదో తరగతి హాల్ టిక్కెట్, మార్కుల లిస్టు, టీసీ, కాండక్ట్ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్(4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు), ఎస్సీ, ఎస్టీ, బీసీలు కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధ్రువ పత్రం, ఈడబ్ల్యుఎస్ కోటాలో సీటు పొందిన వారు ఈడబ్ల్యుఎస్ సర్టిఫికెట్, అభ్యర్థి, అతని తండ్రిది గాని, తల్లిది కాని రెండు పాసుపోర్టు ఫొటోలు, రేషన్ కార్డు, అభ్యర్థి ఆధార్ కార్డు, విద్యార్థులకు ఎవరికైనా బ్యాంకు లోన్ అవసరమైతే పైన పేర్కొన్న సర్టిఫికెట్లన్నీ నాలుగు సెట్లు, అభ్యర్థి తండ్రి ఉద్యోగి అయితే ఎంప్లాయి ఐడెంటి కార్డు, శాలరీ సర్టిఫికెట్, అభ్యర్థి తండ్రి పాన్‌కార్డు, ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ కార్డు తెచ్చుకోవాలి.

ఎలా రావాలంటే

- ప్రకాశం, గుంటూరు జిల్లా వైపు నుంచి వచ్చేవారు విజయవాడ బస్టాండుకు చేరుకున్న తరువాత అక్కడి నుంచి ప్రతి పది నిమిషాలకు నూజివీడుకు బస్సులు ఉన్నాయి. విజయవాడ నుంచి నూజివీడుకు 40 కి.మీ. దూరం మాత్రమే. నూజివీడు బస్టాండులో దిగిన తరువాత అక్కడి నుంచి మైలవరం రోడ్డులో ఉన్న ట్రిపుల్ ఐటీకి నిత్యం ఆటోలు ఉంటాయి.
- శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి వచ్చే విద్యార్థులు హనుమాన్‌జంక్షన్ బస్టాండులో గాని, రైల్వేస్టేషన్‌లో గాని దిగితే అక్కడి నుంచి నూజివీడుకు నిత్యం బస్సులు, ఆటోలు ఉన్నాయి. బస్సు ప్రయాణమే తక్కువ శ్రమ, సురక్షితం అనేది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గమనించాలి.

ఒకే ఒక్కడు

పెనుమంట్ర: పెనుమంట్ర మండలంలో విద్యా శాఖ నిర్లక్ష్యంతో పాఠశాలలు మూసివేసే పరిస్థితి నెలకొంది. సరిగా పాఠశాలల విభజన జరగకపోవడంతో కొన్ని స్కూళ్లలో కేవలం ఒకరిద్దరు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. మండలంలో 47 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అందులో వెలగలవారిపాలెం (ఆర్) పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు, ఎంపీపీ నాగళ్లదిబ్బ, కొయ్యేటిపాడు స్పెషల్ పాఠశాలల్లో ఒక్కో విద్యార్థి ఇప్పటి వరకు చేరారు. వెలగలవారిపాలెం పాఠశాలలో సింగిల్ టీచర్ ఉన్నప్పటికీ నాగళ్ల దిబ్బ, కొయ్యేటిపాడు పాఠశాలలకు ఉపాధ్యాయులు లేకపోవడంతో ఈ పాఠశాలల్లో ఆన్‌లైన్ ద్వారా ఒక్కో విద్యార్థి చేరారు. ఈ పాఠశాలలకు వేరే పాఠశాల నుంచి ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై పంపుతున్నట్లు ఎంఈవో యు.నాగేశ్వరరావు శనివారం తెలిపారు. వెలగలవారిపాలెం పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు ఉన్నట్లు హాజరు చూపుతున్నప్పటికీ శనివారం ఆ పాఠశాలలో ఒక్క విద్యార్థిని మాత్రమే ఉన్నారు. దళితవాడలో పాఠశాలకు నాడు–నేడులో అధునాతన భవనాలు నిర్మించారు. గత ఏడాది ఈపాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు, 30 మంది వరకు విద్యార్థులు ఉండగా, ఈ ఏడాది ఇద్దరు ఉపాధ్యాయులతో 12 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఇదే పరిస్థితి మండలంలో అనేక ప్రభుత్వ పాఠశాలల్లో ఉంది. ఇందుకు విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమని పలువురు తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు.



వెలగలవారిపాలెం (ఆర్) పాఠశాలలో ఒకే ఒక్క విద్యార్థిని



వెలగలవారిపాలెంలో దళితవాడలో నాడు–నేడులో నిర్మించిన పాఠశాల భవనం


ఎస్సీ క్రైస్తవులు, పాస్టర్లపై దాడులు హేయం



సమావేశంలో మాట్లాడుతున్న మెండెం సంతోష్ కుమార్

ఏలూరు(టూటౌన్): దేశంలో, రాష్ట్రంలో ఎస్సీ క్రైస్తవులు, పాస్టర్లపై దాడులు హేయమని, దాడులను నిరసిస్తూ ఈ నెల 30న విజయవాడలో నిర్వహించే ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్‌కుమార్ పిలుపు నిచ్చారు. స్థానిక ఇండోర్ స్టేడియం ఎదురుగా లేడీస్ క్లబ్‌లో ఎస్సీ క్రైస్తవులు, పాస్టర్ల ఆత్మీయ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్సీ క్రైస్తవులు, పాస్టర్లు, చర్చిలపై దాడులు రాజ్యాంగ విరుద్ధమైన చర్యని ఇలాంటి సంఘటనలు ఖండిస్తున్నామన్నారు. ఫాదర్ ఇంజమాల మైఖేల్, కె.శాంతి సాగర్‌లు మాట్లాడుతూ రిజర్వేషన్ల పేరుతో దళితులకు మత స్వేచ్ఛ లేకుండా చేయడం దళితుల ఆత్మ గౌరవాన్ని కించపరచడమే అన్నారు. సమావేశంలో ప్రొఫెసర్ ఎస్‌ఏడీ పాల్, పెరికె వరప్రసాదరావు, దోమతోటి అబ్రహం, నూకపెయ్యి కార్తీక్ పాల్గొన్నారు.

బైక్‌పై నుంచి పడిన వ్యక్తి మృతి



మృతుడు కూచింపూడి నాగు (ఫైల్)

ద్వారకాతిరుమల: కుక్క అడ్డు రావడంతో బైక్‌పై నుంచి పడి తీవ్ర గాయాలు పాలైన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. ఎస్సై టి.సుధీర్ తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని దేవినేనివారిగూడెంకు చెందిన కూచింపూడి నాగు(45) ఈనెల 23 న ఇస్త్రీ పెట్టెలోని బొగ్గుల కోసమని పంగిడిగూడెంకు వెళ్లాడు. తిరిగి సాయంత్రం బైక్‌పై స్వగ్రామానికి వెళుతుండగా, ఘటనా స్థలమైన సూర్యచంద్రరావుపేట జెర్సీ పార్లర్ వద్దకు వచ్చేసరికి అకస్మాత్తుగా కుక్క అడ్డువచ్చింది. దాంతో కుక్కను ఢీకొట్టి రోడ్డుపై పడిపోయిన నాగుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ఏలూరు ఆశ్రం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నాగు శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

సొమ్ముల రికవరీకి చర్యలు

వీరవాసరం: నందమూరి గరువులో డ్వాక్రా సంఘాల్లో జరిగిన స్కాం నగదును రికవరీ చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఏపీఎం కే.జ్యోతిరాణి శనివారం తెలిపారు. 2022 నుంచి 2025 మార్చి వరకు ఖాతాల నుంచి గ్రూపు సభ్యులకు తెలియకుండా పోతుల నాగ స్వాతి, బోడపాటి సత్యవాణి నగదును కాజేశారని వివరించారు. సుమారు రూ.85 లక్షల మేర అవినీతి చోటుచేసుకుందని, బోడపాటి సత్యవాణి నుంచి సుమారు రూ.18 లక్షల మేర రికవరీ చేశామన్నారు. నాగస్వాతిపై వీరవాసరం పోలీస్ స్టేషన్ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయించామన్నారు.

యంత్రాలు ఇప్పిస్తానని మోసం

భీమవరం: వ్యవసాయ యంత్రాలు రాయితీపై ఇప్పిస్తానని రూ.8 లక్షలు తీసుకుని మోసగించినట్లు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ ఎం.నాగరాజు తెలిపారు. పాలకొల్లుకు చెందిన కత్తుల వెంకటేశ్వరరావు భీమవరానికి చెందిన యింకి వెంకటేశ్వరరావు దగ్గర నాలుగు దఫాలుగా నగదు తీసుకున్నారన్నారు. రాయితీపై యంత్రాలు ఇప్పించలేదని ఫిర్యాదులో పేర్కొనగా ఎస్సై కృష్ణాజీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దిగుబడిలో విత్తన శుద్ధి కీలకం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 5.40 లక్షల ఎకరాల్లో వరి సాగు



భీమవరం: సార్వా వరి నారుమడి పనుల్లో రైతులు నిమగ్నయ్యారు. గత రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వెన్ను దన్నుగా నిలబడి అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడంతో రైతులు ఉత్సాహంగా వరి సాగు పట్ల ఆసక్తి చూపించారు. రైతులకు వరి కోత యంత్రాలు, ట్రాక్టర్లకు పెద్ద మొత్తంలో సబ్సిడీ ఇవ్వడమేగాక పంటల బీమా పథకం, ఇన్‌పుట్ సబ్సిడీ వంటివి అమలు చేశారు. ప్రస్తుతం సార్వా సాగుకు సిద్ధమవుతున్న రైతులకు రైతు భరోసా, గత సార్వాసీజన్‌లో వర్షాలు కారణంగా దెబ్బతిన్న రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వకపోవడంతో ప్రస్తుత సీజన్‌లో వరి సాగుకు ఇబ్బందులు పడుతున్నారు. పథకాల మాటేలా ఉన్నా వరి సాగులో విత్తన ఎంపిక, విత్తనశుద్ధి, సస్యరక్షణ వంటి వాటిపై రైతులు దృష్టి పెట్టాలని వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల్లో సుమారు సుమారు 5.40 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేయనున్నారు. దీనిలో పశ్చిమగోదావరి జిల్లాలో 2.08 లక్షల ఎకరాలు, ఏలూరు జిల్లాలో సుమారు 3 లక్షలకు పైగా ఎకరాల్లో సాగు చేయాల్సి ఉంది. వరి నారు మళ్లు వేయడానికి ఎకరాకు 30 కిలోల వరకు విత్తనాలు అవసరమవుతాయి.

విత్తన సేకరణ ఇలా

పురుగులు, తెగుళ్ల ఆశించని పొలం నుంచి విత్తనాన్ని సేకరించుకోవాలి. రైతులు తమ సొంత విత్తనాన్నే వాడుకుంటుంటే పంట కోత కోసిన తరువాత విత్తనాలతో పాటు కలిసిపోయిన మట్టి, శిలీంద్ర బీజాలు, పురుగు తుట్టెలను తీసివేసి శుభ్రం చేసి నిలువ చేసుకోవాలి. బయట విత్తనాన్ని కొనుగోలు చేసే సమయంలో విత్తన శుద్ధి చేశారో లేదో నిర్ధారించుకోవాలి. కొనుగోలు చేసిన విత్తనానికి సంబంధించిన బిల్లును తప్పనిసరిగా తీసుకోవాలి. విత్తనాల మొలక శాతం తప్పనిసరిగా పరీక్షించుకోవాలి.

నాణ్యమైన విత్తనం అయినా

ఎక్కువ మంది రైతులు సొంతంగా విత్తనాలను పండించుకోవడం లేదా తోటి రైతుల నుంచి విత్తనాలను కొనుగోలు చేస్తుంటారు. విత్తనాలతో పాటు కొన్ని తెగుళ్లను కలుగచేసే శిలీంద్రాలు, బ్యాక్టీరియా, వైరస్ వంటివి పంటలను ఆశించి తీవ్రమైన నష్టాన్ని కలుగచేస్తుంటాయి. కొన్ని సందర్భాల్లో నాణ్యమైన విత్తనం అయినప్పటికీ భూమి నుంచి, వివిధ రకాల పురుగుల నుంచి తెగుళ్ల ఆశించి పంటను నష్టపరుస్తూ ఉంటాయి. అందువల్ల పంటను తొలిదశలోనే రక్షించుకోవడానికి సిఫారసు చేసిన శిలీంద్ర నాశినులతో గానీ, పురుగు మందులు లేదా జీవ శిలీంద్ర నాశినులతో తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలి. ఈ విత్తన శుద్ధి మందులు పొడి, ద్రవ రూపంలో, కాన్సన్‌ట్రేట్స్ రూపంలో మార్కెట్‌లో అందుబాటులో ఉంటాయి.

విత్తన శుద్ధి పద్ధతులు

- **పొడి విత్తన శుద్ధి :** డ్రమ్ముల్లో మూడింట రెండొంతులు విత్తనం వేసి సిఫార్సు చేసిన మోతాదులో మందు వేసి బాగా తిప్పితే విత్తనానికి మందు పట్టుకుంటుంది. కొన్ని రకాల విత్తనాలకు జిగురు, బెల్లం ద్రావణం, చిక్కటి గంజి ద్రావణం వంటివి కలపడం వల్ల మందు బాగా పట్టుకుని విత్తనానికి రక్షణ కవచంగా ఏర్పడి చీడ పీడల నివారణకు సాధ్యమవుతుంది.
- **తడి విత్తన శుద్ధి :** ముఖ్యంగా వరి విత్తన శుద్ధికి తగినంత నీటిని తీసుకుని ఆ నీటిలో సిఫార్సు చేసిన మందు కలుపుకుని నీటిలో విత్తనాలను నానబెట్టడం ద్వారా చీడ పీడల నుంచి పంటలను రక్షించుకోవచ్చు.

జీవ శిలీంద్ర నాశినులతో

కొన్ని రకాల జీవ శిలీంద్ర నాశినులతో ముఖ్యంగా ట్రైకోడెర్మావిరిడి. సూడోమోనాస్ వంటి వాటితో విత్తన శుద్ధి చేయడం వల్ల తెగుళ్లను కలుగచేసే శిలీంద్రాలను నాశనం చేయడమేగాక వంట చివరి వరకు కూడా రక్షణ కల్పిస్తాయి. ఈ మందులు భూమిలోనే అభివృద్ధి చెంది తరువాత వేసే పంటలకు కూడా ఉపయోగపడతాయి. వీటి మోతాదు కిలో విత్తనానికి 8 నుంచి 30 గ్రాముల వరకు వాడుకోవాలి. సిఫార్సు చేసిన మందులతో విత్తన శుద్ధి చేసుకోవడం ద్వారా తక్కువ ఖర్చుతో పంటలను చీడపీడల బారి నుంచి రక్షించుకోవచ్చు.

విత్తన శుద్ధితో పంటకు రక్షణ



వరిసాగులో విత్తనశుద్ధి ద్వారా పురుగుమందుల ఖర్చు తగ్గడమేగాక పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చు. సార్వా సాగుకు సిద్ధమవుతున్న రైతులు తప్పనిసరిగా విత్తన శుద్ధిపై దృష్టిపెట్టాలి. విత్తనశుద్ధికి అవసరమైన సమాచారం కోసం అందుబాటులోని వ్యవసాయశాఖాధికారులను సంప్రదించాలి.

– డాక్టర్ ఎంవీ కృష్ణాజీ, వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధానశాస్త్రవేత్త, మార్టేరు

శాశ్వత బ్రిడ్జి కోసం ప్రతిపాదనలు

త్వరలో పంపుతామని చీఫ్ ఇంజినీర్ వెల్లడి

ఉంగుటూరు: నారాయణపురం ఆర్ అండ్ బీ బ్రిడ్జి నిర్మాణ పనులు మూడు నెలల్లో మొదలు పెట్టేందుకు చర్యలు చేపడతామని రోడ్లు, భవనాల శాఖ చీఫ్ ఇంజినీర్ ఎల్.శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. శనివారం ఆర్ అండ్ బీ చీఫ్ ఇంజినీరు ఎల్.శ్రీనివాస్ రెడ్డి రంధ్రాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. రూ. 20 లక్షలతో తాత్కాలికంగా ఐరన్ షీట్ వేసి బెయిలీ బ్రిడ్జి నిర్మించడం వల్ల ఉపయోగం ఉండదన్నారు. శాశ్వత బ్రిడ్జి నిర్మించాల్సిన అవసరముందని తెలిపారు. ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి పంపుతామని, అనుమతి రాగానే పనులు మొదలుపెడతామని చెప్పారు. 11 మీటర్ల రోడ్డు, ఇరువైపులా పాదచారులు నడిచేందుకు ఫుట్‌పాత్ డిజైన్ రూపొందిస్తామని తెలిపారు. పాడైపోయిన బ్రిడ్జిని పరిశీలించిన అనంతరం రూ.60 లక్షల చేబ్రోలు –తల్లాపురం రోడ్డులో కలిసే పుంత రహదారి అభివృద్ధి కోసం తయారుచేసిన ప్రతిపాదిత రహదారిని పరిశీలించారు. చేబ్రోలు పోలీస్‌స్టేషన్ నుంచి నారాయణపురం ఊరిలోకి కాలువగట్టు రహదారిని పరిశీలించారు.



నారాయణపురం బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఆర్ అండ్ బీ చీఫ్ ఇంజినీరు శ్రీనివాసరెడ్డి

పిల్లలతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం

రక్షించిన నిమ్మకాయల యార్డు ముఠా కార్మికులు



భార్య, పిల్లలను భర్తకు అప్పగించిన ఏలూరు రైల్వే ఎస్సై సైమన్

ఏలూరు టౌన్: ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్ సమీపంలో ఒక మహిళ తన ముగ్గురు చిన్నారులతో తమ్మిలేరులో దిగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. వెంటనే నిమ్మకాయల యార్డు ముఠా కార్మికులు స్పందించి సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. రైల్వే ఎస్సై సైమన్ తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా తెనాలి చెంచుపేట, డొంకరోడ్డు ప్రాంతానికి చెందిన పందల లక్ష్మి, జాన్‌పాల్ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. భార్యాభర్తలు శుక్రవారం రాత్రి గొడవపడ్డారు. భర్తతో వివాదం నేపథ్యంలో పిల్లలను తీసుకుని శనివారం మధ్యాహ్నం జన్మభూమి రైలు ఎక్కిన లక్ష్మి ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో దిగింది. సమీపంలోని తమ్మిలేరులో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించింది. కార్మికులు వెంటనే స్పందించి ఆమెను, పిల్లలను బయటకు తీసుకొచ్చారు. పిల్లలు నీళ్ళు తాగారేమో అనే అనుమానంతో ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా.. ఆరోగ్యంగానే ఉన్నట్లు నిర్ధారించారు. ఈ లోగా భర్త జాన్‌పాల్, మహిళ అన్న ఏలూరు చేరుకున్నారు. రైల్వే పోలీసులు జీజీహెచ్‌కు చేరుకుని లక్ష్మి, ఆమె ఇద్దరు చిన్నారులను భర్త జాన్‌పాల్‌కు అప్పగించారు.

క్లుప్తంగా

ఎస్సీ సెల్ అధ్యక్షుడు సురేష్‌కు మాజీ మంత్రి పరామర్శ



సురేష్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ఇటీవల మోకాలు శస్త్రచికిత్స చేయించుకున్న వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పొట్ల సురేష్‌ను మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు శనివారం పరామర్శించారు. సురేష్ నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కారుమూరి వెంట పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, షేక్ జిలానీ ఉన్నారు.

విద్యామిత్ర కిట్ల పంపిణీ



విద్యార్థులకు కిట్లు అందిస్తున్న దృశ్యం

అత్తిలి: విద్యాభివృద్ధికి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు ఎంసీహెచ్ వెంకట్రావు విద్యార్థులకు సూచించారు. అత్తిలి మండలం బల్లిపాడు నెం-1 ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లు స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఎస్ పద్మ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు



బాలసదన్‌లో చిన్నారులతో వైద్య బృందం

తణుకు అర్బన్: స్థానిక జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణలోని జిల్లా బాలల సత్వర చికిత్సా కేంద్ర వైద్యులు తణుకు బాలసదన్‌లోని చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. శనివారం శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యపరీక్షల అనంతరం చిన్నారులకు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు.

ఈడూరు వెంకన్నకు పూజలు



వరాల వెంకటేశ్వరస్వామి

అత్తిలి: మండలంలోని ఈడూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీవరాల వెంకటేశ్వరస్వామికి శనివారం విశేషపూజలు చేశారు. వేకువ జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ, ఉదయం అర్చనలను అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి ఊంజల్ సేవ చేశారు. భక్తులకు అన్నసమారాధన ఏర్పాటుచేశారు.


ఆ పిల్లలకు ఇంటి వద్దే విద్య



దివ్యాంగుల పిల్లలకు ఇంటి వద్దనే విద్య

తాడేపల్లిగూడెం (టీఓసీ): అతి తీవ్ర వైకల్యంతో పాఠశాలకు రాలేని దివ్యాంగ పిల్లలకు ఇంటి వద్దనే విద్య, స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ తర్ఫీదు ఇస్తామని భవిత సెంటర్ ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాల ఈశ్వరయ్య అన్నారు. సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో శనివారం ఇంటి వద్దకు వెళ్లి పిల్లలకు ఇంటి వద్ద విద్యను అందించారు. ఈశ్వరయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమాలు, దివ్యాంగుల పిల్లలకు ఇచ్చే వివిధ సౌకర్యాలను వివరించారు. దివ్యాంగుల లోపాలను చూడకుండా వారిని ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం



కడియద్దలో తల్లులతో మాట్లాడుతున్న ఎంఈఓ హనుమ

తాడేపల్లిగూడెం రూరల్: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, బడి ఈడు పిల్లలను విధిగా పాఠశాలల్లో చేర్పించాలని మండల విద్యాశాఖ అధికారి వి.హనుమ అన్నారు. శనివారం మండలంలోని కడియద్ద ఎస్‌డబ్ల్యూ స్కూలు, ఉప్పరగూడెం, మాధవరం గ్రామాల్లో బడి ఈడు పిల్లల్ని బడిలో చేర్పించే ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఎం పుష్పరాజ్, ఎం జయరాజు, ఉపాధ్యాయులు, పీసీ కమిటీ చైర్మన్లు, అంగన్‌వాడీ టీచర్లు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

మడుగుల రోడ్డు.. రాకపోకలకు పాట్లు





- గూడ్స్ షెడ్డు మార్గంలో దుస్థితి
- మితిమీరిన వేగంతో లారీల రాకపోకలు
- తీవ్ర భయాందోళనలో ప్రజలు





గూడ్స్ షెడ్డు నుంచి శివాలయం వద్ద వరకు ఉన్న గోతులు, గోతుల్లో నిలిచిన నీరు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక పెద్ద శివాలయం నుంచి మొదటి ఫ్లైఓవర్ బ్రిడ్జి వరకు, అక్కడ నుంచి ఫ్లైఓవర్ బ్రిడ్జి పక్కగా గీత ఫంక్షన్ హాల్ మార్గంలో రైల్వే ట్రాక్ వరకు ఉన్న ఇరుకు, మలుపు రహదారి ఛిద్రమై చెరువులను తలపిస్తోంది. గూడ్స్‌షెడ్డు నుంచి వెళ్లే లోడు లారీలు, తిరిగి వచ్చే అన్‌లోడ్ (ఖాళీ) లారీలు కారణంగా పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ గోతుల్లో నీరు చేరింది. ఆ మార్గం అంతా చిత్తడి చిత్తడిగా తయారైంది. బురద బురదగా ఉండటంతో ఆ మార్గంలో ప్రయాణించే ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. బైక్‌లు స్కిడ్ కావడంతో వాహనచోదకులు గాయాలపాలవుతున్నారు. ఎండ ఉన్నప్పుడు బురద ఎండిపోవడంతో దుమ్ము, ధూళి ఎగసిపడటంతో ప్రజలు శ్వాస కోశ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు.

శివాలయం వద్ద ఉన్న కొత్త బ్రిడ్జి మీదుగా గూడ్స్‌షెడ్డుకు వెళ్లే అన్‌లోడు లారీలు, గూడ్స్‌షెడ్డు నుంచి వచ్చే లోడ్ లారీలు ఎదురు, ఎదురుగా వచ్చిన సమయంలో లారీ డ్రైవర్లు ఇరువురు మధ్య గొడవలు పడుతున్నారు. లోడు లారీలు, అన్‌లోడు లారీలు వేగంగా ప్రయాణించడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు, ఆ మార్గంలో ప్రయాణించే వారు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మార్గంలో గోతులు పూడ్చాలని, సీసీ రహదారి నిర్మించాలని, లారీలు వల్ల ప్రమాదాలు సంభవించకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

సీసీ రోడ్డు నిర్మించాలి



శివాలయం వద్ద నుంచి రైల్వే ట్రాక్ వరకు ఉన్న మార్గంలో పెద్ద పెద్ద గోతులు పడ్డాయి. వాహనచోదకులు, పాదచారులు రోడ్డు గోతులు కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. లారీల కారణంగా ఎప్పుడు ఏ ప్రమా దం జరుగుతుందోనని ఆందోళన పడుతున్నాం. అధికారులు స్పందించి సీసీ రోడ్డు నిర్మాణానికి కృషి చేయాలి. – లింగంపల్లి నాగ శ్రీనివాసులు

6న దేవి దర్శనం యాత్ర

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆర్టీసీ తాడేపల్లిగూడెం డిపో నుంచి ఆషాడం దేవి దర్శనం ఒక రోజు యాత్ర జూలై 6న ఉదయం 4 గంటలకు బస్సు బయలుదేరుతుందని, సాయంత్రం డిపోకు చేరుతుందని డిపో నిర్వాహకులు తెలిపారు. టికెట్ ధర రూ.500ని, పూర్తి వివరాలకు ఫోన్ నంబర్లు 73829 05856, 99597 53102, 99855 44411లో సంప్రదించాలని కోరారు. చింతలూరు నూకలమ్మ, మట్లపాలెం మహాలక్ష్మి, కాకినాడ వారాహి, పిఠాపురం పురుహూతిక, తాటిపర్తి అపర్నాదేవి, పెద్దాపురం మరిడమ్మ, కాండ్రకోట నూకాలమ్మ, కడియపులంక ముసలమ్మ తల్లి ఆలయాలను దర్శించి రావచ్చునని చెప్పారు.

సమన్వయంతో పనిచేయాలి

అత్తిలి: వర్షాకాలంలో గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు లేకుండా పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సూచించారు. అత్తిలి మండల పరిషత్ కార్యాలయంలో పారిశుద్ధ్యంపై ఎంపీపీ మక్కా సూర్యారావు అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో తప్పనిసరిగా యాంటీ లార్వా స్ప్రేయింగ్ చేయించాలని ఆదేశించారు. పైపులైన్ల లీకేజీలను అరికట్టాలన్నారు. వైద్యాధికారులు సురేఖ, కిరణ్, వైస్ ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, కొనకళ్ల విజయనిర్మల కాంతారావు, అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లి లైన్ మరమ్మతుల నిమిత్తం ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఈఈ కె.నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ అగ్రహారం, కేఎస్ఎన్ కాలనీ, కొండ్రుప్రోలు, కుంచనపల్లి, ఇటుకలగుంట, అమృతపురం, మెట్ట ఉప్పరగూడెం, మోదుగ గుంట, అప్పారావుపేట, గొల్లగూడెం, వెంకట్రావుపాలెం, ఉప్పరగూడెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

విధులు బహిష్కరిస్తాం



తాడేపల్లిగూడెం (టీఓసీ) : కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న కార్మికులు, సిబ్బంది



తణుకు అర్బన్: నిరసన తెలుపుతున్న కార్మికులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించని పక్షంలో సమ్మెలో భాగంగా విధులు బహిష్కరిస్తామని జేఏసీ నాయకులు హెచ్చరించారు. సమ్మెలో భాగంగా కార్మికులు చేపట్టిన రిలే దీక్ష పట్టణంలో శనివారం ఆరో రోజు కొనసాగింది. జేఏసీ నాయకులు మద్రిపూడి సతీష్ కుమార్, అవిడి కుమార్, ఎర్రంశెట్టి నాగేశ్వరరావు, బండారు శ్రీను, అద్దాల చలపతి, ప్రత్తి రమేష్‌లు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో ఈ నెల 30 నుంచి వాటర్ సప్లై సిబ్బంది విధులను పూర్తిగా బహిష్కరించనున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ యేసుబాబుకు, మునిసిపల్ ఇంజినీర్ వెంకట రమణలకు వినతిపత్రాలు అందజేశారు. ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికులు, సిబ్బంది, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

6వ రోజుకు మునిసిపల్ కార్మికుల దీక్ష

తణుకు అర్బన్: సమస్యల పరిష్కారం కోరుతూ మునిసిపల్ ఇంజినీరింగ్ ఔట్ సోర్సింగ్ కార్మికులు చేపట్టిన నిరాహార దీక్ష శనివారం ఆరో రోజు కొనసాగింది. శిబిరంలో జేఏసీ అధ్యక్షుడు ఉండ్రాజవరపు శ్రీను, కార్యదర్శి గెల్లా విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి విధుల్లో ఉంటున్నా వేతనాలు పెంచకపోవడం, సమాన పనికి సమాన వేతనం, ప్రభుత్వ పథకాలు అమలు చేయకపోవడం వంటి సమస్యలతో తప్పనిసరి పరిస్థితుల్లోనే సమ్మెబాట పట్టామని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జేఏసీ ఆధ్వర్యంలో తమ సమ్మె ఊపందుకుందని వివరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన కోర్కెలను అంగీకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పడాల దానం, సత్యనారాయణ, పిండి పెద్దిరాజు, రాంబాబు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్తోమత లేని వారికి ఉచిత న్యాయ సాయం



సబ్ జైలులో పరిశీలిస్తున్న జడ్జి శ్రీదేవి, న్యాయమూర్తులు

తణుకు అర్బన్: మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, ప్రిన్సిపల్ జిల్లా జడ్జి ఎస్.శ్రీదేవి శనివారం తణుకు సబ్ జైలును సందర్శించారు. సబ్ జైలులో రిమాండ్ ముద్దాయిలకు అందుతున్న ఆహారం, వసతులపై ఆరాతీశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ముద్దాయిలంతా రిమాండ్ అనంతరం బయటకువెళ్లిన తరువాత మంచి సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. న్యాయవాదిని పెట్టుకునే స్తోమతలేనివారికి మండల న్యాయసేవల కమిటీ ద్వారా ఉచిత న్యాయ సహాయం, సేవలు అందిస్తారని, ప్రతిఒక్కరూ న్యాయవాదిని కలిగి ఉండాలని అన్నారు. వచ్చేనెల 5న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో కేసులను రాజీ చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవల సంస్థ సెక్రటరీ కె.రత్న ప్రసాద్, జడ్జిలు డి.సత్యవతి, కె.సత్యలత, సాయిరాం పాతర్లంక, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్, బెంచ్ కోర్టు మెజిస్ట్రేట్ తాడి ఆంజనేయులు, సబ్ జైలు సూపరింటెండెంట్ ఎ.మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి సత్యవతి

తణుకు అర్బన్: వచ్చే నెల 5వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసేందుకు పోలీసు అధికారులు కృషిచేయాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గో అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి పేర్కొన్నారు. తణుకు కోర్టులో శనివారం పోలీసు, ఎక్సైజ్ శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించి రాజీ మార్గంపై ఇరువర్గాలకు అవగాహన కల్పించి వాటిని పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణసత్యలత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సాయిరాం పాతర్లంక, బెంచ్ కోర్టు మెజిస్ట్రేట్ తాడి ఆంజనేయులు, బార్ అసోసియేషన్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్, తణుకు కోర్టు పరిధిలోని పోలీసు అధికారులు, ఎక్సైజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

కాలువల ప్రక్షాళన పనుల పరిశీలన



జువ్వలపాలెం పరిధిలో పాలిమేర కోడు మురుగు డ్రెయిన్ తవ్వుతున్న దృశ్యం

కాళ్ల: ఆకివీడు డీసీ పరిధిలో సుమారు రూ.70 లక్షలతో కాలువల మరమ్మతుల పనులు చేపట్టినట్లు ఆకివీడు డీసీ చైర్మన్ గోకరాజు వెంకట శివరామరాజు, డ్రెయినేజీ ఏఈ జయప్రకాష్ తెలిపారు. కాళ్ల మండలం జువ్వలపాలెం పరిధిలోని పాలిమేర కోడు మురుగు డ్రెయిన్ ప్రక్షాళన పనులు శనివారం వారు పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. డీసీ పరిధిలోని రుద్రాయకోడు మురుగు డ్రెయిన్‌ను సుమారు రూ.32లక్షలతో, చినకాపవరం మీడియం డ్రెయిన్ ప్రక్షాళన పనులు సుమారు రూ.28 లక్షలతోను, అదేవిధంగా అవిసెలకోడు, ఉప్పుటేరు రైల్వే బ్రిడ్జి దగ్గర పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్క, కిక్కిస తొలగింపు పనులతో పాటు వెంకయ్య వయ్యేరు కాలువలో పేరుకుపోయిన చెత్త తొలగింపు పనులుకూడా చేపట్టినట్లు ఆయన స్పష్టం చేశారు. వీటితోపాటు ఎన్నో ఏళ్ళుగా అభివృద్ధికి నోచుకోని జువ్వలపాలెం పాలిమేరకోడు మురుగు డ్రెయిన్ పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తున్నట్లు తెలిపారు.

బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలయ్యేనా?

మహిళల అసహనం



అత్తిలి బస్‌స్టేషన్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

అత్తిలి: అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోంది. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు, ప్రతి నెలా మహిళలకు రూ.1500, యువతకు నిరుద్యోగభృతి కింద రూ.3 వేలు అంటూ సూపర్ సిక్స్ హామీలు గుప్పించారు. అధికారం చేపట్టి సీఎం కుర్చీ ఎక్కిన చంద్రబాబు తూతూ మంత్రంగా ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీ ప్రారంభించారు. త్వరలో ఉచిత బస్సు ప్రయాణం అంటూ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి ప్రకటించగా, మరో మంత్రి ×రోడ్డు మ్యాప్ వేద్దాం, వచ్చే ఏడాది నుంచి పథకాలు అమలుపై దృష్టి సారిద్దాం₹ అని చెప్పుకొచ్చారు. హామీలు చూస్తుంటే భయమేస్తుందని ఏకంగా సీఎం చంద్రబాబు చెప్పడంపై అన్ని వర్గాల ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక ఉచిత ప్రయాణం లేనట్టేనా అని మహిళలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో సూపర్ సిక్స్ పథకాల్లో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఒకటి, ఎన్నికల ముందు మహిళలు ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణం చేయవచ్చంటూ విస్తృతంగా ప్రచారం చేశారు. ఉచిత బస్సుబ ప్రయాణం ఇంకెప్పుడూ అని మహిళలు ప్రశ్నిస్తున్నారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత ఆర్టీసీ ప్రయాణం అమలు చేశాయి. అయితే ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ కూడా అదే ఫార్ములాను అమలు చేసింది. ఉచిత బస్సు అంటూ జోరుగా ప్రచారం చేసింది. ఉచిత బస్సు హామీని నేటికీ కార్యరూపం దాల్చలేదు. చంద్రబాబు ఉచిత బస్సు ప్రయాణమని ప్రజలను మభ్య పెట్టారని స్పష్టం కావడంతో మహిళలు ఉసూరమంటున్నారు. తణుకు నియోజకవర్గంలో 3 లక్షలకు పైగా జనాభా ఉన్నారు. 18 ఏళ్లు పైబడిన మహిళలు 1,25,810 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళలే అధికంగా ఉన్నారు. ప్రతి రోజు సగటున 40 శాతం మంది మహిళలు బస్సుల్లో ప్రయాణిస్తున్నట్టు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

ఉచిత ప్రయాణం అమలు చేయాలి



మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అని ఎన్నికల ముందు హామీ ఇచ్చి ఇప్పటి వరకు అమలు చేయలేదు. ఎప్పుడు అమలు చేస్తారో కూడా తెలియడంలేదు. పక్క రాష్ట్రంలో అధికారం చేపట్టిన వెంటనే ప్రభుత్వం అమలు చేసింది. ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలి. – బుడితి శ్రీలత, అత్తిలి

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

అత్తిలి: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటాలని పిఠాపురం శ్రీవిశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా ఉద్బోధించారు. అత్తిలి అజయ్‌నగర్‌లో శనివారం పీఠం సభ్యుడు ఆల్తి అజయ్ కుమార్ నివాసంలో నిర్వహించిన ప్రత్యేక ఆరాధన కార్యక్రమంలో ఆలీషా ప్రసంగించారు. ఎంపీపీ మక్కా సూర్యారావు, టీడీపీ నేత అధ్యక్షుడు పోలిశెట్టి చందు, నీటి పంపిణీ కమిటీ చైర్మన్ నల్లూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

వీరవాసరం: ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జూలై 9న నిర్వహిస్తున్న దేశ వ్యాప్త సమ్మెలో ఆశ వర్కర్లు పాల్గొని విజయవంతం చేయాలని ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షులు సీహెచ్ లక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం ఆశా వర్కర్ల యూనియన్ వీరవాసరం మండల విస్తృస్థాయి సమావేశం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. యూనియన్ నాయకులు డి వరలక్ష్మి సమావేశానికి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీహెచ్ లక్ష్మి మాట్లాడారు. ఆశ వర్కర్లపై పని ఒత్తిడి తగ్గించాలని, పీహెచ్‌సీ పరిధిలో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రికార్ప్ ఇవ్వకుండానే రికార్డ్స్ రాయమంటున్నారని, ఆన్‌లైన్ వర్క్‌లతో పాటు ఇతర పనులను కూడా అప్పగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశార. ఆశా వర్కర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా నాయకుడు ఎం ఆంజనేయులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. జేబీ, సంతోష్ వాణి, దుర్గ, శిరీష, గౌరీ పాల్గొన్నారు.

శ్రీవారికి ఊంజల్ సేవ

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని జేపీ రోడ్డులో ఉన్న శ్రీ పద్మావతి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారికి శనివారం ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకరణ నిర్వహించారు. వేంకట సత్య దుర్గ నాగ సోమరాజు దంపతులచే ఈ కార్యక్రమం జరిపారు. భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మానసిక వైద్యశాలలను సందర్శించిన జడ్జి



మానసిక రోగులతో మాట్లాడుతున్న జడ్జి జ్యోతి

భీమవరం: భీమవరం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని శాంతి, ప్రశాంతి, వర్మ మానసిక వైద్యశాలలను భీమవరం రెండవ అదనపు మొదటి తరగతి మేజిస్ట్రేట్ ఎస్ జ్యోతి సందర్శించి మానసిక రోగులతో మాట్లాడారు. రోగులకు అందుతున్న వైద్య, వసతి సదుపాయాలను, వారి మానసిక స్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వారికి ఎటువంటి న్యాయపరమైన సలహాలు అవసరమైన మండల న్యాయ సేవా సంస్థను సంప్రదిస్తే ఉచిత న్యాయ సహాయం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు బి సురేష్ కుమార్, కె జ్యోతి, ఎం బీ భవాని, మానసిక వైద్యులు జీవీ రమణరావు, మాదిరెడ్డి వెంకటరమణ, శ్రీదేవి, టూటౌన్, ఎస్సై రామారావు తదితరులు పాల్గొన్నారు.

పేరంటాలమ్మ ఆలయం వద్ద వేలం



ఆలయం వద్ద వేలం నిర్వహిస్తున్న ఎండోమెంట్ అధికారులు

ఉండి: వెలివర్రులో ప్రసిద్ధి గాంచిన వీరపేరంటాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద శనివారం ఎండోమెంట్ అధికారులు ఆలయ ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ అధికారి తోట శ్రీనివాస్ ఆధ్వర్యంలో అమ్మవారి చీరలు, దుకాణం నిర్వహణ, కొబ్బరిచెట్లు, కొబ్బరి చెక్కల సేకరణపై వేలం నిర్వహించారు. ఏడాది కాలనికి గాను అమ్మవారి చీరలు, జాకెట్ల సేకరణకు గొడవర్తి శ్రీనివాస్ రూ.1.90 లక్షలకు, దుకాణ నిర్వహణకు కుడిపూడి శ్రీనివాస్ రూ.2.76 లక్షలు, కొబ్బరి చెట్లు నల్లూరి చంద్రకుమార్ రూ.7,500, కొబ్బరి చెక్కల సేకరణకు బొక్కా రెడ్డియ్య రూ.30 వేలు, షామియానా నిర్వహణకు రూ.93,500 చొప్పున వేలం దక్కించుకున్నారు. కార్యక్రమంలో పలువురు దేవాదాయ శాఖ అధికారులు ,గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సికిల్ ఎనీమియాపై వైద్య సిబ్బందికి అవగాహన

పాలకోడేరు: కుముదవల్లిలో జిల్లా మలేరియా ఇన్‌చార్జి అధికారి క్రాంతి ఆధ్వర్యంలో శనివారం వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సికిల్ ఎనీమియా అంటే ఏమిటి, ఈ వ్యాధి ఎలా వస్తుంది, పరీక్షలు ఏ విధంగా చేయాలి, ఎవరికి వస్తుంది, ఏ విధంగా నియంత్రించవచ్చు అనే అంశాలను వైద్య సిబ్బందికి వివరించారు. ముఖ్యంగా ఈవ్యాధి జన్యుపరంగా చిన్నపిల్లల్లో వస్తుందని, గ్రామాల్లో తరచూ వైద్య పరీక్షలు నిర్వహించి సికిల్ ఎనీమియా లక్షణాలు కనిపించినట్లయితే ఆరంభం నుంచి తగు మందులను వాడించితే ఆ వ్యాధి నుంచి త్వరగా కోలుకోవచ్చని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.